ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024

5

అనంతపురం







.జెవివి ప్లీనం మహాసభల సందర్భంగా ప్రజలను చైతన్యం చేస్తూ గాజు పెక్కలపై నడవడం, కత్తిని గుండెల్లో గుచ్చుకోవడం మ్యాజిక్ కార్యక్రమాలను చేస్తున్న జెవివి ప్రతినిధులు

అలరించిన మ్యాజిక్ షో

కొందరు చేసే మాయల అసలు రహస్యాలను తెలిపేలా జెవివి ప్రతినిధులు ప్లీనం మహాసభల్లో ప్రజలను చైతన్య వంతం చేస్తూ మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు. కత్తిని శరీరంలోకి పొడుచుకోవడం, నాలుకపై కర్పూరం వెలిగించడం, గాజు పెంకులపై నడవడం తదితర వాటిని ప్రదర్శించారు. సైన్స్‌ను అడ్డుపెట్టుకుని కొందరు ఇలాంటి గారడీలు చేస్తున్నారని తెలియజేశారు.



ఉత్తేజభరితం.. చైతన్యపూరితం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో రెండు రోజుల పాటు జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర 17వ వార్షిక మహాసభ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. మహాసభలు ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాతాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న 400 మంది ప్రతినిధులు దేశంలోనూ, రాష్ట్రంలో పెరుగుతున్న అశాస్త్రీయ విధానాలు, మతత్వ వైఖరులతోపాటు సైన్స్ ప్రచార ఆవశ్యకతను ఈ రెండు రోజుల మహాసభలో చర్చించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పాటు, మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం రెండు రోజుల మహాసభలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ మాజీ అధ్యక్షులు సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం జిల్లాల వారీగా సాగిన చర్చల్లో జన విజ్ఞాన వేదిక ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. అందులో ఏ మేరకు ప్రభావం చూపగలిగిందన్నది కూడా చర్చించారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి ఏ రకంగా వెళ్లాలి... ప్రధానంగా యువతను సైన్స్ ఉద్యమంలోకి రప్పించడం ఎలాగన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చల్లో యువత కూడా పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ క్రోడీకరించి భవిష్యత్ కార్యాచరణను జన విజ్ఞాన వేదిక రూపొందించింది. ఈ మహాసభకు జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి కూడా విచ్చేసి రాబోయే రోజుల్లో కలిసి పనిచేద్దామని పిలుపునివ్వడం అందరిలో ఉత్సహాన్ని నింపింది. మహాసభలకు ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి రెండు రోజులు విచ్చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 90 ఏళ్ల వయసులో ఆయన నడవలేని స్థితిలోనూ మహాసభ ప్రాంగణానికి విచ్చేసి సైన్స్ ఉద్యమం జయప్రదం కావాలని ఆకాంక్షను వ్యక్తం చేయడం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది.



ముగింపు సందర్భంగా అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర, జిల్లా జెవివి కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న డా॥గేయానంద్



మాట్లాడుతున్న డా॥వి.బ్రహ్మారెడ్డి

జెవివి మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు

1. మతోన్మాద విష ప్రచారం నిలిపివేయాలి.దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాలి.
2. మహిళలపై అమానుషంగా అతి హేయంగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలి. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలు చేపట్టాలి.
3. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం దేశ ప్రగతికి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరం.వెంటనే రద్దు చేయాలి.
4. రాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయలి. ప్రజల ధనమాన ప్రాణాలను కాపాడాలి.
5. యువతను నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థలపై నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

రెండు రోజుల కార్యక్రమాల్లో జెవివి గౌరవ అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ పాల్గొని సౌహార్ధ సందేశమిచ్చారు. రెండోవ రోజు కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు పాల్గొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి- కొన్ని పరిశీలనలపై మాట్లాడారు. ఇలా రెండు రోజుల సైన్స్ పండుగ ఉత్సహపూరిత వాతావరణంలో జరుగుతూ అందరినీ ఆలోచింపజేశాయి. మహాసభల సందర్భంగా మధ్యమధ్యలో చేపట్టిన మ్యాజిక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో జెవివి ప్రధాన కార్యదర్శి కుద్రా రామారావు, ఉపాధ్యక్షులు త్రిమూర్తులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయత వైపు దేశాన్ని నడిపిద్దాం : విఠపు బాలసుబ్రమణ్యం

అశాస్త్రీయతను బలవంతంగా ప్రజలపై రుద్దే పాలకుల చర్యలను ఎండగడుతూ దేశాన్ని శాస్త్రీయత వైపు నడిపించేలా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలియజేశారు. జెవివి ప్లీనం రాష్ట్ర మహాసభల సందర్భంగా ముగింపు సందేశాన్ని ఇచ్చారు. తమ మతం వాడే ప్రధాని, అధ్యక్షుడు కావాలనే తపన చాలా దేశాల్లో ప్రజల్లో కన్పిస్తోందని, ఇలాంటి పరిస్థితి మనదేశంలో కూడా ఉందన్నారు. మతం ప్రాతిపకదను పాలకులను ఎన్నుకోవడం సరికాదన్నారు. సైన్స్‌కు దగ్గరగా దేశం, సమాజాం నడవాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రీయ విజ్ఞానం, ప్రయోగాల వైపు యువత ముందుకు సాగాలన్నారు. జెవివి భవిష్యత్తులో సాధించాల్సింది ఇంకా చాలా ఉందన్నారు. అందుకు సమిష్టిగా కలిసి వచ్చే సంస్థలు, విజ్ఞాన వంతులతో పని చేసి సైన్స్‌పై పెద్ద ఎత్తున ప్రచారాలు చేయాలన్నారు. విద్య, ప్రజారోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, నాలుగు రంగాల్లో ప్రధానంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యవర్గంలో పలువురు

జెవివి రాష్ట్ర కార్యవర్గంలోకి పలువురిని ప్లీనం మహాసభలో ఎన్నుకున్నారు. మాణిక్యం శెట్టి, కామేశ్వరరావు, శివనాగేశ్వర రావు, జి.మహేష్, రాజగోపాల్‌ను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు.



జెవివి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

జెసి సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో కలిపి వెంటనే రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం సిఐటియు కార్యాలయం సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల సాధన సదస్సులో పాల్గొని మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ వ్యవహారంలో ప్రభుత్వం సమగ్రంగా చర్చించిన తర్వాత ముందుకు వెళ్లాలని సూచించారు. సిఆర్‌పిలు ఎవరూ ఆందోళన చెందొద్దని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉంటారని చెప్పారు, అగ్రిమెంట్ బాండ్ విధానాన్ని రద్దు కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలని పిలుపుచ్చారు. చిరుద్యోగుల సమస్యల పైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల రాయలసీమ ప్రాంతీయ సదస్సును ఓబురెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర జెఎసి అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్షా పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైమ్స్ స్కేల్ విధానాన్ని అమలు చేసి హెచ్‌ఆర్‌ఎ డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యూటీ కల్పించాలి అని చెప్పారు. సామాజిక భద్రత పథకాలు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ఎక్స్ గ్రేషియా రూ.20 లక్షలు పెంచాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, జెఎసి రాష్ట్ర నాయకులు ఎ.నాగరాజు, జెఎసి జిల్లా నాయకులు సురేష్ వర్మ, నాగరాజు, మాధవ్, శంకరయ్య, నరసింహమూర్తి, నూర్ మహ్మద్, సిఐటియు అనంతపురం జిల్లా అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

గ్రామాల అభివృద్ధికి చేయూత

డిపిఒ విజయ్‌కుమార్ రెడ్డి

.ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామపంచాయతీల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి అవుతుందని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెలిబుచ్చారు.



ప్ర: జిల్లాలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి.? వాటిలో ఏఏ అభివృద్ధి పనులు సాగుతున్నాయి.?

డిపిఒ : శ్రీ సత్యసాయి జిల్లాలో 467 పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచడానికి అన్ని చర్యలూ చేపడుతున్నాం. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాలు, దోమల నివారణకు దోమల మందును పిచికారీ చేస్తున్నాం. నీటి నిల్వలు లేకుండా చూడడం వంటి చర్యలతో పాటు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే అది ప్రజలకే హాని చేస్తుందనే విషయాలపై అవగాహన కల్పించాం.

ప్ర: పంచాయతీల్లో వేసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు ఉన్నాయా.?

డిపిఒ : పంచాయతీల్లో వేసిన అక్రమ లేఅవుట్ల వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవడమే కాక ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికి వీలుంటుంది. పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు వేసి పలువురు భారీగా సంపాదిస్తున్నారని పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా, పంచాయతీ అనుమతులు లేకుండా జిల్లా వ్యాప్తంగా చాలా లేఅవుట్లు వేశారు. అలాంటి వాటిపై చర్యలు చేపడతాం. ఇప్పటికే ఇలాంటి వాటిని గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలు సేకరించి వాటిపై ఇదివరకే చర్యలు తీసుకున్నాం. గత ప్రభుత్వంలో అక్రమంగా లేఅవుట్లు వేసిన వాటిపై పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై తక్షణ చర్యలు తీసుకుంటాం. అప్రూవల్ లేని లేఅవుట్లకు సంబంధించి నోటీసులు మంజూరు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిపిఒ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా పంచాయతీలను అభివద్ధి చేయడానికి సత్వర చర్యలు చేపడుతున్నా. ఇందులో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కన్స్ట్రక్షన్ ఈజీ సర్వీస్ అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, డిఎల్‌పిఒలు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యి నిర్వహించనున్నాం. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: పంచాయతీల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..?

డిపిఒ : పంచాయతీల్లో శుభ్రత పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. తాగునీటి సరఫరా పథకాల ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయిస్తున్నాం. ప్రతిరోజు క్లోరినేషన్ చేయడం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నాం. చెత్తతో సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా సంపదను సష్టించే చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 421 చెత్తతో సంపద సృష్టి కేంద్రాలను నిర్వహణ చూడటం, వాటి ద్వారా రైతులకు వాన పాములు ద్వారా తయారుచేసిన ఎరువులను విక్రయించే కార్యక్రమాలు చేపడుతున్నాం.



డిపిఒ విజయ్‌కుమార్ రెడ్డి

ఉచిత పంటల బీమా అమలు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతులకు సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-2025 రబీ, ఖరీఫ్ సీజన్లకు కొత్త పంటల బీమా విధానాన్ని ప్రకటించిందన్నారు. అయితే కొత్త విధానంలో ప్రయివేట్ బీమా కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా రైతులకు నష్టదాయకంగా ఉందన్నారు. గత పదేళ్ల అనుభవమే ఇందుకు నిదర్శమన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నూతన విధానాన్ని రద్దు చేసి సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలు చేయాలని కోరారు. రైతుల భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. గతంలో బ్యాంకులో పంటల రుణం తీసుకునే రైతులకు బీమా ప్రీమియం రుణం మొత్తం నుంచి మినహాయించుకుని రైతుల వాటా బ్యాంకులు చెల్లించే విధానం అమలులో ఉందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన విధానంలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా విధానంలో ప్రధానమంత్రి ఫసల్‌బీమాలో భాగంగా ప్రయివేటు బీమా కంపెనీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఈ విధానం ద్వారా ప్రయివేటు బీమా కంపెనీలకు లాభాలు తప్ప రైతుల ప్రయోజనాలు ఉండవన్నారు. కావున ప్రభుత్వ బీమా కంపెనీలను మాత్రమే పంటల బీమాలో భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రబీలో అత్యధికంగా సాగయ్యే పప్పుశనగ పంటకు కూడా బీమా వర్తింపజేయాలన్నారు.

'శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి' కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

సిఎం చంద్రబాబుకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల దాహార్తి తీర్చే శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించి నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకున్నాయి. రెండూ పర్యాయాలు జిల్లా అధికార యంత్రాంగం కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు నిర్వహించినప్పటికి సమస్య కొలొక్కి రాలేదు. ఈ క్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడకు ఫోన్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఓబులు సమస్యలపై వివరించారు. దేశంలో అత్యంత కరువు ప్రాంతాల్లో అనంతపురం రెండవ స్థానంలో ఉందన్నారు. ప్రజల దాహార్థి తీరుస్తున్న శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి పథకంలో 700 మంది పైబడి కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. 7 నెలలుగా వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొందన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికుల కుటుంబాలు కడవటం చాలా కష్టంగా ఉందని తెలిపారు. 1997లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీసత్యసాయి తాగునీటి పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 2021 తరువాత వచ్చిన గత ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకుండా ప్రాజెక్ట్ నిర్వీర్యం చేసే పరిస్థితిని అనుసరించారని తెలిపారు. 2020వ సంవత్సరంలో రూ.2.10 కోట్లు నెల బడ్జెట్ ఉంటే ప్రస్తుతం పెరగాల్సింది పోయి రూ.70 లక్షలకు కుదించడం చూస్తునే కుట్ర తెలుస్తోందన్నారు. క్వాలిటి కంట్రోల్, క్వాలిటీ అసిస్‌మెంట్ పేరుతో గత ప్రభుత్వం కార్మికులను కుదించేందుకు ప్రతిపాదనలు తీసుకొచ్చిందన్నారు. దీన్ని కార్మిక సంఘాలుగా తీవ్రంగా ప్రతిఘటించామని తెలిపారు. స్పందించి గత ప్రభుత్వం చేసిన క్వాలిటి కంట్రోల్, క్వాలిటి అసెస్‌మెంట్ ప్రతిపాదనలు ఉప సంహరించాలని కోరారు. బడ్జెట్ రూ.30 కోట్లు బిఆర్‌ఓ వచ్చినప్పటికి పై స్థాయిలో ఉన్న కొందరు అధికారుల నిర్వాకం వల్ల కార్మికులకు బకాయిలు చెల్లించడంలో ఆలస్యమౌతోందన్నారు. దీనిపై పరిశీలన చేసి త్వరితగతిన వేతనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసత్యసాయి, నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి, సిపిడబ్ల్యూఎస్ కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. నెల నెల వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే..

'శ్రీరామిరెడ్డి, సత్యసాయి' కార్మికుల సమ్మె

బ్రహ్మసముద్రం : వేతన బకాయిలతోపాటు సమస్యలు పరిష్కరించాలని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్కర్స్, యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూర్‌స్వామి మాట్లాడుతూ నెలలు, నెలలు వేతనాలు చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలని, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసైన్‌మెంట్ కమిటీ ప్రతిపాదన, క్యూఏ, క్యూసి కమిటీ ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి తొలగించిన బొమ్మగానిపల్లి ఎర్రిస్వామినాయక్‌ను తక్షణమే వీధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్కర్స్, యూనియన్ మండల అధ్యక్షుడు వన్నూరుస్వామి, కార్యదర్శి చిత్తప్ప, తిప్పేస్వామి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

రోడ్లపై పశువుల మందలు

ప్రమాదాల బారిన వాహనదారులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సాధారణంగా రోడ్లపై వాహనాలు వెళుంటాయి. కానీ అనంతపురం నగరంలో మాత్రం రోడ్లన్నీ పశువులవే. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీగా ఉండే రోడ్లలో, డివైడర్లపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. వీటి గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అవి ఉన్నట్లుండి పైకి లేచి వాహనాలకు అడ్డుగా రావడం, లేదంటే కొట్లాడుతూ వాహనదాలపైకి దూసుకెళ్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, పోలీసులు నిత్యం అదే రోడ్లలో తిరుగుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చలానాలు విధించే పోలీసులు రోడ్లపై పశువులు తిష్ట వేసి ప్రమాదాల బారిన పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. వారం రోజుల క్రితం స్థానిక రవి పెట్రోల్ బంక్ ఎదుట హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కారుకు ఆవు అడ్డం రావడంతో సడెన్ బ్రేక్ వేశారు. అదే సమయంలో ఆదోని నుంచి కర్నాటకలోని పావగడకు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. కార్లు బాగా దెబ్బతిన్నప్పటికీ ఎయిర్ బ్యాగులు తెరుచుకుని ప్రమాదం తప్పడంతో ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. పోలీసులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని పశువుల యజమానులతో చర్చించి రోడ్లపైకి రాకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆవు అడ్డు రావడంతో ముందు వెళ్తున్న కారును ఢీకొని దెబ్బతిన్న కారు (పాతచిత్రం)



రోడ్లపై ఉన్న పశువులు

ప్రజాశక్తి
www.prajasakti.com



నిరసన తెలుపుతున్న సిపిడబ్ల్యుఎస్ తాగునీటి పథకం కార్మికులు

9నెలల వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి..?

సిపిడబ్ల్యుఎస్ తాగునీటి పథకం కార్మికులు

ప్రజాశక్తి-ఉరవకొండ

9 నెలలుగా వేతనాలు చెల్లించకపోతే తమ కుటుంబాలు ఏం తిని బతకాలని ఉరవకొండ ఆర్‌డబ్ల్యుఎస్ పథకంలో పని చేస్తున్న కార్మికులు చేపట్టిన ఆందోళన ఆదివారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమపై నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు నెలనెలా వేతనాలు చెల్లించాలని, బకాయి ఉన్న పిఎఫ్ సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, రాజశేఖర్, సాదిక్, చిన్నబాబు, శంకర్, శ్రీనివాసులు, ఉమాపతి, పెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకమవుదాం

పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలందరూ అవగాహనతో ఏకం కావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మంచాల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్లాభ్ అధ్యక్షతన ఆదివారం స్థానిక వివికె డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో జరుగుతున్న ఫలితాల సరళిగానే ప్రజలు భావిస్తున్నారన్నారు. అయితే ప్రజల చేత, ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పడి, ప్రజలు యజమానులుగా కొనసాగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యంగా భావించాలన్నారు. బలవంతులు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని పరిపాలన సాగిస్తున్నారన్నారు. అలాకాకుండా రాజ్యాంగం, చట్టాలు ప్రజల కోసమే పని చేసినప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివుడు, జిల్లా నాయకులు టివి.రెడ్డి, సుబ్బరాయుడు, రమణారెడ్డి, డాక్టర్.అంకే రామలింగయ్య, నగర కమిటి నాయకులు కె.ఓబుళపతి, రామకృష్ణ, మంజునాథ్, రూరల్ కమిటీ నాయకులు సంగా ఫణి, భూషణ్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

యాడికి : వామపక్ష యోధుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సిపిఐ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

రాయదుర్గం : జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నంద్యాలలోని శాంతిరామ్ ఆసుపత్రికి చెందిన వైద్యులు 485 మంది రోగులను పరీక్షించారు. వీరిలో114 మందికి కంటి ఆపరేషన్లు, 13 మందికి గుండె ఆపరేషన్లు చేయాలని నిర్ధారించి రెండు బస్సుల్లో శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జోనల్ ఛైర్మన్ లక్ష్మణ్, అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్, మహిళా ప్రెసిడెంట్ రజియా బేగం, అదనపు కార్యదర్శి కె.రాజశేఖర్‌రెడ్డి, రాయదుర్గం తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సురేష్, మండల బాధ్యులు లక్ష్మీరెడ్డి, రాముడు, లక్ష్మణ్, శివ రుద్ర, సుధామోహన్, ఆనంద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటేశులు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు ప్రశాంతంగా చేసుకోండి : డీఎస్పీ

అనంతపురం క్రైం : మిలాద్ ఉన్‌నబి సందర్భంగా సోమవారం నిర్వహించనున్న ర్యాలీలను ప్రశాంతంగా చేసుకోవాలని అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం అనంతపురం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనమ ఆట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం పురస్కరించుకుని చేపట్టే ర్యాలీల సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ముస్లిం మతపెద్దలు, నగర సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి విద్యార్థులకు క్రీడాపోటీలు

బుక్కరాయసముద్రం : ఈనెల 20వతేదీ నుంచి విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారులు నవీద, లింగానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, 21న మండల కేంద్రంలోని ఆర్‌డిటి మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సవారమ్మ అమ్మవారి ఆభరణాలకు రూ.5లక్షల విరాళం



గ్రామస్తులకు విరాళాన్ని అందజేస్తున్న దాత జీకే కృష్ణమూర్తి

కుందుర్పి : మండలంలోని బెస్తరపల్లిలో వెలసిన గ్రామ దేవత సవారమ్మ అమ్మవారి ఆభరణాల కోసం బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. ఈమేరకు ఆదివారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా జీకే కృష్ణమూర్తి మాట్లాడుతూ సొంత ప్రాంతం ఆధ్యాత్మికం, ప్రాంత అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొమ్మ మమత, కొమ్మ హనుమంతురాయుడు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లతో నీరు సరఫరా

కుందుర్పి : మండల కేంద్రంతోపాటు తూముకుంట గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు మారుతీశ్వరి రామమూర్తి, రామాంజనేయులు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మె చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాక్టర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

భయం భయంగా 'కస్తూరిబా' విద్యార్థినులు

ఆకతాయిల వెకిలిచేష్టలు
ప్రహరీ ఎత్తు పెంచాలని వేడుకోలు
నార్పల కస్తూరిబా గాంధీ పాఠశాలలో పరిస్థితి





తక్కువ ఎత్తులో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రహరీ,
బాలుర పాఠశాల ప్రహరీ గోడను పగులకొట్టిన ఆకతాయిలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల వెనకవైపు ప్రహరీ ఎత్తు పెంచి రక్షణ కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు. ప్రహరీ పక్కనే బాలికల మరుగుదొడ్లు ఉన్నాయి. దీనికితోడు ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానానికి కస్తూరిబా పాఠశాల ఆనుకుని ఉంది.క్రీడా మైదానం వైపు ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రి సమయంలో క్రీడా మైదానంలో ఆకతాయిలు మద్యం తాగి అరుపులు, కేకలు వేస్తూ విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో రాత్రి 8 గంటలు దాటిన తర్వాత అమ్మాయిలు మరుగుదొడ్డికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి.

ఇటీవల కాలంలో హాస్టల్లో ఆకతాయిలు చొరబడిన ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. దీంతో స్థానిక విద్యార్థినులు కూడా భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు క్రీడా మైదానంలో అక్కడకక్కడ కొందరు ఆకతాయిలు ప్రహరీని కూలగొట్టి రాత్రిళ్లు మైదానంలోనే మద్యం తాగుతూ బాటిళ్లను పగులగొడుతున్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులతోపాటు వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కస్తూరిబా గాంధీ పాఠశాల వెనకవైపు ఉన్న ప్రహరీ ఎత్తు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా క్రీడామైదానంలో మద్యం తాగి కేకలు వేస్తూ విద్యార్థినులకు భయభ్రాంతులకు గురి చేస్తున్న ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ పితామహుడు 'మోక్షగుండం'


జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజనీరింగ్ పితామహుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం వర్సిటీ ఆవరణలో ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు ర్పించారు. ఈ సందర్భంగా అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డేను జరుపుకుంటున్నామన్నారు. ఎందుకంటే విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గా ప్రపంచఖ్యాతిని గడించారని గుర్తు చేశారు. ప్రపంచంలో అత్యధికంగా ఇంజినీర్లను తయారు చేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటని తెలిపారు. వారందరూ విశ్వేశ్వరయ్యని ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, సిబ్బంది విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి.సత్యనారాయణ, బి.ఈశ్వర్‌రెడ్డి, సుజాత, జి.ప్రశాంతి, వైశాలి ఘోర్పడే, సురేష్‌బాబు, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, సిఇ ఎపి.శివకుమార్, శంకర్, శేఖర్‌రాజు, ఎస్.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, కె.మాధవి, ఎం.రామశేఖర్‌రెడ్డి, దిలీప్‌కుమార్, జోజిరెడ్డి, శివలింగారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, రంగానాయక్, మధుసూదనరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.



జెఎన్‌టియులో విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న సిబ్బంది



జెఎన్‌టియులో విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న మేయర్, నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత అని మేయర్ మహమ్మద్‌వసీం కొనియాడారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నగరంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మనందరికీ ఎన్నో సాగు, తాగునీటి ప్రాజెక్టులతో దేశ నిర్మాణానికి కృషి చేశారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, బాలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో కణేకల్లు-వేదవతి హగరిపై బ్రిడ్జి పనులు

ఇఎన్‌సి నయీముల్లా ఖాన్

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లు-వేదవతి హగిరిపై నవంబర్‌లో నూతన బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు ఇఎన్‌సి నయీముల్లాఖాన్ తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం నుంచి కలేకుర్తి దిగువ రోడ్డు వరకూ నూతన నిర్మాణ బ్రిడ్జి కోసం ఇరిగేషన్ ఎస్ఇ ఓబుల్‌రెడ్డి, ఇఇ రాజగోపాల్, డిఇ రవిశంకర్, జెఇ సుజాతతో కలిసి భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.48 కోట్లతో 2 కిలోమీటర్ల పొడవున రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. 2002లో అప్పటి ప్రభుత్వం నూతన బ్రిడ్జి కోసం రూ.40 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో టెండర్లు సైతం పిలిచారు. అయితే అగ్రిమెంట్‌కు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఈనేపథ్యంలో రూ.48 కోట్లు మంజూరు చేయడంతో శ్రీ సాయి కన్‌స్ట్రక్షన్ వారు బ్రిడ్జి పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో పూర్తిస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం చేపడతామని గుత్తేదారు రామ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం ఇఎంసి నయీముల్లాఖాన్‌ను టిడిపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాలప్ప, మాజీ ఉపసర్పంచి ఆనందరాజ్, షేక్ ముజ్జు సలీం, అనిల్, నాగరాజు, రమేష్, మాబూసాబ్, చాంద్, అల్తాఫ్, తిప్పేస్వామి, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కురుబలు అన్నిరంగాల్లో రాణించాలి

కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కురుబలు విద్య, వైద్య, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో రాణించాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల కురుబ సంఘం అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కురుబలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎందుకంటే కురుబ సామాజిక వర్గానికి ఒక మంత్రి, రెండు ఎంపీల స్థానాలను కేటాయించారని గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులను కురుబలకు కేటాయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో తాలూకాలోని కురుబలందరికీ న్యాయం అందుతుందన్నారు. అనంతరం మండలం కురుబ సంఘం కమిటీ, యువజన సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నాగిరెడ్డిపల్లి వెంకటేష్, నాయకులు కామకపల్లి నాగరాజు, గుండిగానిపల్లి కురుగౌడ, సందీప్, పోలేపల్లి సోమశేఖర్, హనుమంతు, రాము, నాగరాజు, బోరంపల్లి మల్లికార్జున, రామచంద్ర, పోలేపల్లి కురిమల్లి, ఎసి చంద్రన్న, కోనాపురం కరేగౌడ, పోలేపల్లి కేకే గౌడ, బజ్జన్నగౌడ, మంజునాథ్, సోమశేఖర్, రవీంద్ర, రామన్న, సురేష్, అశోక్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు : ఎస్పీ

అనంతపురం క్రైం : ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మిలాద్- ఉన్-నబీ పర్వదినం సందర్భంగా నేడు రద్దు చేసినట్లు ఎస్పీ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు ప్రజావేదిక

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రామచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 17న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు గమణించి హాజరుకావాలని కోరారు.

గుమ్మఘట్ట ఎస్ఐగా ఈశ్వరయ్య

గుమ్మఘట్ట : మండల నూతన ఎస్ఐగా ఈశ్వరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మండలవ్యాప్తంగా పేకాట, అసాంఘిక కార్యకలాపాలు, కర్ణాటక మద్యం విక్రయాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాగా టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నికిష్టప్ప, బెస్తమూర్తి, అంజి, మంజునాథ, తదితరులు ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముస్లిములకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

అనంతపురం కలెక్టరేట్ : నియోజకవర్గంలోని ముస్లిములకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన వేడుకను మహమ్మద్ ప్రవక్త బోధనలైన శాంతి, కరుణ, ధార్మిక చింతన, దాతత్వం, ఐకమత్యం, సర్వమానవ సమానత్వం ప్రపంచమంతా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే ర్యాలీలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

పుట్లూరు : ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-క్రాప్ నమోదుకు గడువు పొడిగించినట్లు వ్యవసాయ శాఖ ఎఒ కాత్యాయని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 15 వరకూ గడువు విధించగా, తాజాగా ఈనెల 30 వరకూ పెంచినట్లు తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యల్లనూరు : రైతులు సాగు చేసిన పంటల ఈక్రాప్ నమోదు గడువును ఈనెల 23వ తేదీ వరకూ పొడిగించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా వందశాతం ఈ క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఇంకా ఎవరైనా ఈక్రాప్ చేసుకోకపోతే చేసుకోవాలని కోరారు.

ఆత్మకూరు : ఈ-క్రాప్ నమోదుకు ఈనెల 30వతేదీ వరకూ గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ ఈక్రాప్ నమోదు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు



అనంతపురం: ఆంధ్రవాళ్లు హైదరాబాద్‌కు బతకడానికి వచ్చారని, కెసిఆర్ ప్రభుత్వం వస్తే సీమాంధ్ర వాళ్లను తరిమికొడతామని చేసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎపి స్టూడెంట్ జెఎసి జిల్లా అధ్యక్షులు అమర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. గత తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కి హైదరాబాద్ నగరంలో ఎక్కువ అసెంబ్లీ సీట్లు గెలవడానికి ఆంధ్రావాళ్ల కారణమనే విషయాన్ని కౌశిక్‌రెడ్డి గ్రహించాలన్నారు. అలాంటి వారిని బతకాడినికి వచ్చారని అనడం బాధాకరమన్నారు. ఇద్దరి ఎమ్మెల్యేల సమస్యను ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేలా తీసుకురావడం మంచిది కాదన్నారు. వెంటనే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మసీదులో అన్నదానం

గుత్తి : మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకుని ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్‌లో ఉన్న తాజ్ నియాజియా మసీదులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి ప్రారంభించారు. అనంతరం టిడిపి నాయకులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నులిపురుగుల నివారణకు కృషి

ఉరవకొండ : నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేద్దామని సర్పంచి మల్లెల జగదీష్ పిలుపునిచ్చారు. ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ పురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఈనెల 17న పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లలో నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్, ఆరోగ్య కార్యకర్తలు ఇందిర, పావని, అంగన్వాడీ కార్యకర్తలు చంద్రమణి, శశికళ, సరోజ, సోమేశ్వరి, ఆశా కార్యకర్తలు లింగమ్మ, మల్లిక పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రయివేటీకరణ సరికాదు

రాయదుర్గం : 2024-25 విద్యా సంవత్సరం నుంచి నూతన మెడికల్ కళాశాల నడపలేమని ఎన్‌ఎంసికు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం దౌర్భాగ్యమని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 5 మెడికల్ కళాశాలలో ప్రారంభించి 700 సీట్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణంలో ఉన్న మరో 7 కళాశాలల నిర్మాణం పనులను నిలిపివేశారన్నారు. కావున మెడికల్ కళాశాలలో పనులను పున ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

'అనంత'ను కలిసిన నార్పల మైనార్టీ నాయకులు

నార్పల : జిల్లా వైసిపి అధ్యక్షులు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని ఆదివారం అనంతపురంలోని ఆయన నివాసంలో నార్పల మండల మైనార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో మాజీ సర్పంచి ఖాదర్ వలీఖాన్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ అమీర్‌బాషా, తదితరులు ఉన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు, శ్రీసాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ, మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంజనీర్స్ డే సందర్భంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా అన్నప్రసాదం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, రవికుమార్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

పెద్దవడుగూరు : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వెంకటాంపల్లికి చెందిన నాగేశ్వరరావుకు తన మిత్రులు ఆపన్న హస్తం అందించారు. నాగేశ్వరరావు అనారోగ్యంతో మంచాన పడ్డాడు. విషయం తెలుసుకున్న పెద్దవడుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నగేష్, జయరాముడు శ్రీనివాసరెడ్డి, సుంకన్న, ఏకాంబరేశ్వరయ్య, శంకరరెడ్డి, రంగడు, రామచంద్రారెడ్డి, సుదర్శనరెడ్డి తదితరులు ఆదివారం బాధితుడి ఇంటికి చేరుకుని రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒకచోటు చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, బేగం, పార్వతి, నాగలక్ష్మి, వెంకటస్వామి, ప్రసాద్, చంద్రశేఖర్, వెంకటనాయుడు, భయపరెడ్డి, నారాయణను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుని కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో రసూలిల్లా, దస్తగిరి, శ్రీధర్, షేక్షావలి, లయన్ పఠాన్, రసూల్ ఖాన్, బాబావాలి, శ్రీనివాసులు, మోహన్‌బాబు, నరేష్, రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, కుమార్, రాజా, నాగేంద్ర, రామానాయుడు, సాధిక్, సురేష్, జగదీశ్వర్‌రెడ్డి, రఫీ, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పశువుల దొంగలు అరెస్టు

తాడిపత్రి రూరల్ : మండలంలో పశువుల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని గన్నవారిపల్లి కాలనీకి చెందిన పరమేష్, మనోహర్ తమ మూడు గేదెలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారంటూ శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సీఐ శివగంగాధర్‌రెడ్డి వంగనూరుకు చెందిన బాబు, మారుతిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులోని నేషనల్ థర్మల్ పవర్ గ్రిడ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పట్టణంలోని కమాటం వీధికి చెందిన నరసింహ, పరమేష్ అనే యువకులు ద్విచక్ర వాహనంలో వెళుండగా ఎన్టీపిసి వద్ద బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు